# ఆహా! ఏమి ఈ జీవన రహస్యము!

-సుగుణ

"ఓ... ఓ... ఓ..."

తెల్లారుజామునే ఈ రంకెలు విని ఉలిక్కిపడి లేచిపోయాను. శబ్దం కిటికీ కింద నుంచే వస్తున్నట్లనిపించింది. కర్టెన్ తొలగిస్తే కింద ఏం కనపడలేదు. కాస్త దృష్టి సారించగానే శబ్దం పక్కనే వున్న ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చెట్టు దగ్గర నుంచి వస్తున్నట్లు అర్థమయింది. కనీ కనిపించని వెలుగులో చెట్టుకి కట్టేసున్న ఆవు కదలకుండా నిలబడి హృదయ విదారకంగా అరుస్తున్న అరుపులవి అని తెలిసొచ్చింది.

ఒక పది నిముషాలు అరుపులు వింటూనే నిద్రపోదామని ప్రయత్నించి, సాధ్యపడక, లేచిపోయి, కాలకృత్యాలు తీర్చుకుని, వాకింగ్ షూస్ వేసుకుని, బీచొడ్డున నడుద్దామని బయలుదేరా. ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ గేటు ముందునుండి వెళ్తూంటే వాచ్‌మెన్ నారాయణ ఆవు పలుపుతాడు పట్టుకుని నిలబడి, అటూ ఇటూ చూస్తూ కనిపించాడు.

"ఏమిటోయ్ నారాయణా, ఆవుకి మేత వెయ్యడం లేదా, అలా అరుస్తోందీ?" అన్నా.

"ముప్పొద్దులా వేస్తూనే వుంటాం బాబూ. చుట్టూ బోలెడు పచ్చగడ్డి. మేతకి లోటూ లేదు, కరుసూ లేదు. దానికిప్పుడు కావల్సింది మేత కాదు బాబూ" అన్నాడు నర్మగర్భంగా చిరునవ్వు నవ్వుతూ.

అర్థమయిందిలే, అన్నట్లు నేనూ నవ్వి వెళ్లిపోబోతూంటే, నారాయణ నన్నాపి, అడిగాడు,

"ఇయాల ఆదివారం కదాండీ, కాస్త ఖాళీ వుంటదేంటి?"

"ఉంటుంది. ఏమిటి సంగతి?" అన్నా.

"ఆవు జతకోరుతోందండి. ఎద్దుల సూరి దగ్గరికి తీసికెళ్లాలి. ఒక్కడ్నే పట్టుకోలేను. ఈ మల్లేష్‌గాడు ఆదివారం అసలు కంటిక్కనిపించడు. తొమ్మిదింటికి సింహాచలం డూటీ కొస్తాడు గానీ, అందాకా ఆవు ఆగేట్టు లేదు. మీరో సెయ్యేస్తే, సూరింటికి తీసుకెళ్దారనీ.." అని నీళ్లు నమిలాడు నారాయణ.

మల్లేష్ గెస్ట్‌హౌస్ కీపరు. ఇరవైయ్యేళ్లుంటాయి. అప్పుడప్పుడు చిన్న చిన్న పనులు చేసిపెట్టి, జీన్సూ, టీషర్ట్‌లూ అడిగి పట్టుకుపోతుంటాడు. ఆదివారం వచ్చేసరికి, షోకులన్నీ చేసుకుని, నల్ల కళ్లజోడు తగిలించుకుని, సినిమాలు చూడ్డానికి చెక్కేస్తాడు. ఒకసారి ఆరుగంటలాటికి జాకీచాన్ సినిమాకెళ్తే అక్కడ కనిపించాడు. గుర్తుపట్టలేకపోయా. వాడి దగ్గర ఎక్స్‌ట్రా టిక్కెట్టుంటే నాకిచ్చాడు. సినిమా ఇద్దరం పక్క పక్కన కూచుని చూసాం. నేను నా కళ్లజోడుతోనూ, వాడు నల్లకళ్ల జోడుతోనూ.

ఆదివారాలు సినిమాలూ, టీవీలూ చూసి చూసి, విసుగెత్తిపోయున్న నేను, ఇదేదో డైవర్షన్‌లా వుండచ్చని, 'సరే, వస్తా పద', అన్నా. నాకెలాగూ తొమ్మిదయితే కానీ, కాఫీ, బ్రేక్‌ఫాస్టూ ఏదీ అవసరం పడదు. ఇంకా ఆరయినా అవలేదు. తూర్పున సూర్యుడు ఎర్రని రశ్మిని నాలుగు దిశలా అప్పుడప్పుడే వెదజల్లుతున్నాడు. నారాయణ ఆవు మెడచుట్టూ కట్టిన చిన్న మోకు పట్టుకుంటే, నేను పొడుగ్గా వున్నతాడు కొస పట్టుకున్నాను. ఇద్దరం ఆవుతో నడుస్తున్నాం. తనకోసం ఎద్దు ఎదురు చూస్తోందని తెలిసినట్లు, ఆవు రోడ్డు మీద పడి మమ్మల్ని లాక్కెళ్లిపోతోంది. చిన్న పరుగులాటి నడకతో మేము దాన్ని అనుసరించాం.

ఎద్దుల సూరి ఇల్లు విశాలంగా వున్న పాక. అటూ, ఇటూ వున్న రెండు పొడుగాటి పాకలు ఆవులూ, ఎద్దులూ వుండే సావిడీలు. ఖాళీ జాగాని పరిమితం చేస్తూ చిన్న ప్రహరీగోడ. అందులోనే ప్రవేశద్వారం. గేటు లేదు. మేం ఆవుని లోపలికి తీసుకొచ్చి నిలబడ్డాం. సూరి ఆవుల పాకలోంచి క్యాన్‌లో పాలు పట్టుకుని వస్తూ, మమ్మల్ని చూసి క్యాన్ దింపి, దగ్గరకొచ్చి, ఆవు మెడ ప్రేమగా నిమిరి, గౌరమ్మా తయారుగా వున్నారా?" అనడిగాడు. అవునన్నట్లు ఆవు పైకీ కిందకీ బుర్రాడించింది. నేను నోరు తెరిచి చూస్తూంటే సూరి నా వంక తిరిగి, "బాబుకిదంతా కొత్త కాబోలు," అని, నారాయణతో, "పెయ్యా, కోడె కావాలా ఈపాలి?" అన్నాడు.

"అదెలా చెప్పగలం?" అన్నాను నేను సంభ్రమం నుంచి తేరుకుంటూ.

"సెప్పగలం బాబూ. సెప్పగలం" అన్నాడు సూరి ఆవు కదులుతూంటే, మెడలోని మోకుతో దాన్నదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తూ.

"కోడెనేటి సేసుకుంటారు. పెయ్యయితే పాలు

గెస్టొవుసుకి పనికొస్తాయ్" అన్నాడు నారాయణ.

"ఒరే, ఈరభద్రా, శివులార్ని తోలుకురా", అన్నాడు సూరి. "నాతో రండి బాబూ", అని నన్ను ఎద్దుల కొట్టం వెనుకనున్న చిన్న ఖాళీ జాగాలోకి తీసుకెళ్లాడు. అక్కడ దృశ్యం చూడగానే నా నోరూ, కళ్లూ రెండూ ఇంకా తెరుచుకుపోయాయి. ఎత్తైన గట్టుమీద, నాలుగు కాళ్లపై నుల్చుని, గంభీరంగా మా వంక చూస్తున్న ఒక బ్రహ్మాండమైన రాతి ఎద్దు విగ్రహం కనపడింది. ఎప్పుడో క్లాసు పుస్తకాల్లో చూసిన మొహన్‌జొదారో బుల్ బొమ్మ జ్ఞాపకం వచ్చింది.

ఇంతలో వీరభద్రుడన్నతను ఎద్దుని తీసుకొచ్చాడు. సూరి దాని మెడలోని తాడందుకుని ఎద్దు విగ్రహం ఎదురుగా నిలబెట్టాడు. అది ముందు రెండు కాళ్లూ వంచి విగ్రహానికి మోకరిల్లింది. సూరి అది లేచి నిలబడగానే, "శివులారూ, గౌరమ్మ కాడికి పదండి" అన్నాడు. అంతే! అంతవరకూ నమ్రతగా గంగిరెద్దులా కనపడిన ఎద్దు స్వరూపం ఒక్కసారి మారిపోయింది. శరీరాంగాలు బలంతో నిండిపోయి, కాళ్లకి అడ్డం వస్తూంటే, ఆవుని కట్టేసి వున్న రాట దగ్గరకి దారి తీసింది. ఆవు చిన్న చిందులేస్తోంది.

"ఈరభద్రా, ఇంకో తాడట్రా," అంటూ సూరి గబగబా ఆ తాడూ ఆవు మెడలో కట్టేయించాడు. ఇరుప్రక్కలా నారాయణా, వీరభద్రుడూ తాళ్లు బిగువులా లాగి ఆవుని కదలకుండా పట్టుకున్నారు. "సూరీడు వైపు ముఖం తిప్పండి. జాగర్త, చుట్టు తిరగనివ్వద్దు. పెయ్య కావాలిట. జాగరత, జాగరత" అని అదిలిస్తూ, ఎద్దుని ఆవు దగ్గరకి తీసికెళ్లాడు, "శివులారూ, కానియ్యండి," అని దాని చెవులో మెల్లిగా అన్నాడు. అరక్షణంలో ఎద్దు పని కానిచ్చేసింది. నా కళ్ల ముందు రేగిన దుమ్ము అణగారాక చూసే సరికి, ఎద్దు మళ్లీ ముందున్నట్లు డొసైల్‌గా నిలబడి వుంది. దాని ముఖం మీద ఏదో ఘనకార్యం చేసినట్లు భావం కదలాడినట్లు నాకో అనుమానం! నారాయణ ఆవుని గెస్ట్‌హౌస్‌కి తీసికెళ్లి పోయాడు. నా సహాయం అవసరం పడలేదు, ఇక, ఎద్దూ వీరభద్రుడితో కొట్టంలోకి వెళ్లిపోతూంటే, "దండాలు సామీ, కటాక్సించండి" అన్నాడు సూరి దాని డోలునిమిరి. "ఈరభద్రా, బాబుకి పాలట్రా" అని కమాండు పారేసి నన్ను పాకింటిలోకి తీసుకెళ్లాడు.

స్టూలు మీద కూర్చుని పాలు తాగుతూ సూరినడిగాను, "పెయ్య పుట్టడానికీ, సూర్యుడి వైపు ఆవు ముఖం పెట్టించడానికీ వున్న సంబంధం ఏమిటి? అలా చేస్తే పెయ్యే పుడుతుందని ఏమిటి నమ్మకం?"

"సత్తెం సత్తెమే బాబూ" అన్నాడు సూరి.

"అంటే సూర్యుడికి వెనుదిరిగితే కోడె పుడుతుందా?" అన్నాను.

"నమ్మకంగా. ఆ మద్దిన పెయ్య కావాలని తొలిసారి ఆవుని తీసుకొచ్చినారు. సరింగా, సమయానికి ఆవు రెండు గంతులేసి తిరిగిపోయింది. అంతేమరి. కోడెనీనేసినాది. ఆ యివరాలన్నీ రాసినా. వుండండి సూపిస్తా." సూరి లేచి అక్కడే చెక్క బీరువా మీద పేర్చివున్న బడిపిల్లల పుస్తకాల లాంటివి ఓ దొంతు పట్టుకొచ్చాడు. మొత్తం అయిదు ఎద్దులకీ గత పన్నెండేళ్లగా ఎన్ని కోడె దూడలు పుట్టాయి, ఎన్ని పెయ్యలు పుట్టాయి, మొదలైన వివరాలన్నీ క్రమ పద్ధతితో రాసున్నాయి, తిరిగిపోయి, పెయ్యకి బదులు కోడెని కన్న ఆవు పేరుతో సహా. ఎక్కువ సంఖ్య పెయ్యలదే. నూటికి ఎనభై తొమ్మిది దూడలు పెయ్యలూ, పదకొండు కోడెలూనూ.

"ఇంత నిర్ధారణగా ఫలితాలు వస్తుంటే, దేశంలో కెల్లా అతిపెద్ద పాల వ్యాపారస్థుడయిపోవచ్చే! ఇదంతా ఎవరికైనా చెప్పావా అసలు?" అన్నా ఆశ్చర్యంగా.

"పాలేనేటి బాబూ, పెతీమాటూ కోడెలే పుడితే మాత్తరం బిగినెస్సుండదేటి? అదేటది, జపాను దేశం వోరి 'కోడెబీపంట' శానా పెసిద్దంట. అట్టాంటిదేదో సేసేవోడ్నే," అన్నాడు సూరి. "ఉన్నదేదో సాలు బాబూ. ఆశకంతుంటదేటి?"

"కోబే బీఫ్" అని సరిదిద్దానే కానీ, సూరి వ్యాపారంలోని రహస్యాలు ఇంకా తెలుసుకోవాలని అనిపించి, అదే అడిగాను.

"కిటుకులేం లేవు బాబూ, మా నాయన నాకిచ్చిన ఆస్తి మా నందీశ్వరుడు. ఆయనకు పుట్టిన కోడె దూడలే యీ అయిదూను. యాపారం సేసుకుంటా, కుర్రాళ్లు నలుగుర్నీ నదింపించుకున్నా, ఇప్పుడు సేతికందొచ్చినారు. నా తర్వాత యాపారం తెలివితో సూసుకోగలరని నమ్మకం" అన్నాడు సూరి, విధేయతతో.

"అసలీ సూర్యుడి వక్క తిరగడంలోని రహస్యమేమిటి? నందీశ్వరుడంటే నాకు చూపించిన రాతి విగ్రహమా?" అనడిగాను. ఎందుకో సూరి తన ఎద్దులకి ఇచ్చే గౌరవం చూసాక, 'ఎద్దు బొమ్మ' అనలేకపోయాను.

"రగస్యమేటీ లేదు బాబూ. మా అయ్య

నందీశ్వరులనిస్తూ ఒకే సూత్రం చెప్పిందు, మగెద్దు నుండే జీవకణాలు ఆడావులోనికి ఎల్తాయి. ఆడపెయ్యా కోడెదూడా అన్నది ఎద్దు మటుకే నిర్ణయిస్తది, అవునా, కాదా?" అన్నాడు.

చిన్నప్పుడు తెలుగు మీడియంలో చదువుకున్న సైన్సు పాఠం లీలగా గుర్తొచ్చింది.

"అవును, తెలుసు" అన్నాను.

"అవట్టా ఎల్తా వుంటే, సూరీడు తన ఎలుగుతో ఆడకణాలని తనైపు జోరుగా లాగేసుకుంటాడు. నాలుగు కాళ్ల మీద నిలబడున్న ఆవు కడుపులో గరభం ఆటిని పొందికసేసుకుంటది. ఇంకేటి? పెయ్యా పుడతది" అని సింప్లిఫై చేసేసాడు.

"సూర్యుడి ఆకర్షణ శక్తి ఆడకణాలకేనా?" అన్నాను, సందేహం ఇంకా తీరక.

"దవుటు నేదు బాబూ. అదే ఆవు యిటేపు తిరిగిందనుకోండి. ఆడకణాలకి జోరు తగ్గిపోద్ది, మగకళాలు పందెంలో గెలిసిపోతాయి. కోడె పుట్టేస్తది"

"నీ థియరీ బాగానే వుంది కానీ, ఎంతో దూరాన్నున్న సూర్యుడికింత ఆకర్షణ శక్తి వుందనీ, అది ఆవు గర్భంలోకి జొరబడుతుందనీ నమ్మలేకపోతున్నాను" అన్నాను.

"థీరీ కాదండి. జరిగేదే అది. మరట్టాగయితే సెంద్రుడు సంవుద్రం మీద కెరటాలని పైకీ కిందకీ లాగుతున్నాడా లేదా. సెంద్రుడి కున్న పవరు సూరీడు కెందుకుండదూ?"

నిజమేనని ఒప్పుకోక తప్పలేదు.

"మా నందీశ్వరుడి ఇగ్రహం సూసినారుగా? పెద్దది సేసి కట్టించింది కాదండి. ఆయన్ని ఆవు దగ్గరకి తీసుకెళ్లడానికి నలుగురు జెమా జెట్టీల్లాటి మడుసులు కావల్సొచ్చేవారండి. ఆయన కటాక్సం సేసిన ఆవులన్నీ రోజుకి ముప్పయి శేర్ల పాలిచ్చేవండి" అన్నాడు గర్వంగా.

కొంచెం అతిశయోక్తనిపించినా, సూరిని కవ్వించాలని, "మరి ఎద్దుల చేత ఎందుకు మొక్కిస్తావ్? ఆవులనే తీసుకెళ్లచ్చుగా ఆయన దగ్గరకి డైరక్టుగా" అన్నాను.

"అమ్మమ్మమ్మ! అదేం మాటండి! మొక్కిన పెతీ యెద్దుకీ ఆయన దీవెనిచ్చేస్తాడండి. ఆటి పని అయిసేసుకుపోతాయండి. ఆరి అంశ కదాండి మరి!" అన్నాడు సూరి భక్తిగా. "అయినా ఆవులు ఆయన్ని సూస్తే, యెద్దుల్ని దరికి రానీయవండి. దేముడి గది యేరూ, పడగ్గది యేరూ కదండి" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"ఈ సూత్రం మనుషులకి కూడా వర్తిస్తుందంటావా?" అనడిగా కుతూహలంగా.

"పడతాదండి. ఒక ఇసయం గుర్తెట్టుకోవాలండి. జంతువు నాలుక్కాళ్ల మీద నిలబడుద్దండి. మడుసులు ఎల్లికిలా ఉంటారు గదాండి. ఆ పెకారం ఏ దిక్కున తిరగాలో ముందే ఆలోసింసుకోవాలండి" అన్నాడు.

"అయితే ఈ సూత్రం పాటించి నువ్వు ఫలితాలు పొందినట్టేనా?" అన్నా.

"ఈరభద్రుడు నలుగురు కొడుకుల్లో ఆఖరోడండి. ఆడగుంటలు యెద్దుల్నేటి పట్టుకోగలరండి?" అని సూరి విషయం సూక్ష్మంగా తేల్చేసాడు.

"మరి నే వస్తా" అని లేచా.

నన్ను సాగనంపుతూ సూరి ఆఖరి బోధ చేసాడు.

"మడుసులకి రాత్తిరి పూట సూత్రం పన్చేయదండి. సూరీడు కడ్డంగా భూమొచ్చేస్తది గందా? సూరీడు పెభావం సూపించలేడు. బాబుగారికి పెళ్లయిందా?" అనడిగాడు, చనువుగా భుజం మీద చెయ్యేసి.

కాస్త సిగ్గుపడి, "ఆగస్టులో పెళ్లి, ముహూర్తం నిశ్చయం అయింది" అన్నా.

నవ్వుతూ చెయ్యూపుతున్న ఎద్దుల సూరి రూపం అలా కళ్ల ముందు కదలాడుతూంటే, వీరభద్రుడి వెనక మోటారు సైకిలు మీద కూచుని ఇంటికెళ్తున్న నా మనసులో మెదులుతున్న ఆలోచనల రూపం వేరు.

నేనుండే ఇంట్లో సూర్యరశ్మి ఏ వేళల్లో కిటికీలోంచి బెడ్రూంలోకి ప్రసరిస్తుందో గమనించాలి, ఎటుపడితే అటు తిప్పుకోడానికి వీలుగా డబల్‌కాట్‌కి వీల్స్ పెట్టించాలి.

## దీపాల వెల్తుర్లు

ఆ పాపను
అడుగుదామని వుంది!
ఆరాధనతో వెలిగించిన
దీపాల వెల్తుర్లు ఎలా వున్నాయని
కంటిపాపను
అడుగుదామని వుంది!

-విజయశ్రీ .జి